సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 11 । జూన్ । 2023



వైద్యసేవలు, విజయాలు ప్రజలకు వివరించాలి - 8లో

వైద్యారోగ్యశాఖ విజయాలు, సేవలు ప్రజలకు వివరించాలని డీఎంఈ రమేశ్‌రెడ్డి.. ఉమ్మడి జిల్లా వైద్యాధికారులకు సూచించారు.



లింగనిర్ధారణ యంత్రాలను అమ్మిన వారి అరెస్ట్

అనుమతి లేకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే యంత్రాలను అమ్ముతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 40.0^0 /29.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రంగా ఉండి ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి 'ఇంటర్ అడ్వాన్స్‌డ్' పరీక్షలు

విద్యారణ్యపురి : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు హనుమకొండ జిల్లాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు డీఐఈవో శనివారం తెలిపారు. మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం పరీక్షలు రేపటి నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2-30 నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తారు. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 12,084 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 344 మంది విద్యార్థులు.. మొత్తం 12,428 మంది హాజరుకానున్నారు. రెండో సంవత్సరం జనరల్ విభాగంలో 3,859 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 201 మంది.. మొత్తం 4,060 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి, రెండో సంవత్సరం కలిపి 16,488 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం జిల్లాలో 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. 38 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 38 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, రెండు ఫ్లయింగ్, మూడు సిట్టింగ్ స్క్వాడ్లు, ఏడుగురు కస్టోడియన్లను నియమించారు. పరీక్షల నిర్వహణను హైపవర్ కమిటీ కూడా పర్యవేక్షించనుందని డీఐఈవో తెలిపారు. విద్యార్థులు నిర్దేశించిన సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు రావాలని ఆయన కోరారు.

వరంగల్ జిల్లాలో..

కాశీబుగ్గ సెంటర్ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వరంగల్ ఇంటర్ విద్యాశాఖ అధికారి కాక మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 19 పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేయగా ప్రథమ సంవత్సరం పరీక్షలకు 2,571 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,173 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

నేడు తెలంగాణ సాహిత్య దినోత్సవం

హన్మకొండ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సిక్తాపట్నాయక్ తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో సాయంత్రం ఐదు గంటలకు కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేర్లు నమోదు చేసుకున్న కవులు, రచయితలు, సాహితీవేత్తలు సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ సాధించిన ప్రగతి అనే థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. గంగా జమునా తెహజీబ్ సంస్కృతి ప్రతిబింబించేలా తెలుగు, ఉర్దూ కవులు పాల్గొంటారని తెలిపారు. సాహితీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా ప్రజాకవి కాళోజీ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పిస్తారు.

తప్పుడు పత్రాలతో ప్లాట్లు విక్రయించిన ఇద్దరి అరెస్ట్

కాజీపేట : ప్రశాంత్‌నగర్ కాలనీలో 16 ప్లాట్లకు తప్పుడు పత్రాలు సృష్టించి విక్రయించిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన మర్రిపెల్లి సుధాకర్, మహేశ్వరం అభిలాష్, కడారి రవీందర్‌రెడ్డి, వాకాటి వెంకటేశ్వర్లు, అందె రాజ్యలక్ష్మి, నూర కుమారస్వామితోపాటు మరికొందరి ప్లాట్లకు కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి తప్పుడు పత్రాలు సృష్టించారు. అతి తక్కువ ధరకు ఈ ప్లాట్లను ఇతరులకు అమ్ముకుని వచ్చిన డబ్బులను అందరూ సమానంగా పంచుకున్నారు. కొనుగోలు చేసిన వ్యక్తులు ప్లాట్లపైకి వెళ్లి ఆక్రమణకు ప్రయత్నించారు. వాస్తవ పరిస్థితిపై విచారణ చేయగా తప్పుడు కాగితాలు తయారు చేసి రిజిస్ట్రేషన్లు చేసినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో ఇటీవల బాధితులు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా లేని భూమికి వారసులుగా ప్రకటించుకుని విక్రయాలు చేపట్టిన భూక్యా యమున, కొడుకులు సంపత్‌కుమార్, అనిల్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ ముఠాకు ప్రధాన సూత్రధారులుగా వ్యవహరించిన పల్లకొండ సాంబమూర్తి, న్యాయవాది లాడే రమేష్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

సీపీని కలిసిన ఎస్పీ పుష్పారెడ్డి



వరంగల్ క్రైం: నాన్‌కేడర్ ఎస్పీగా పదోన్నతి పొందిన అదనపు డీసీపీ పుష్పారెడ్డి శనివారం సీపీ రంగనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా సీపీ.. ఆమెకు అభినందనలు తెలిపారు.

నలుదిక్కులా రహదారులు!

గ్రేటర్ వరంగల్ చుట్టూ నేషనల్, స్టేట్ హైవేలు


- మొదలైన కరీంనగర్-వరంగల్...
- వరంగల్ - ఖమ్మం, మంచిర్యాల - విజయవాడ పనులు
- సిద్దిపేట టు వరంగల్ వయా ఎల్కతుర్తికి నిధులు
- ఔటర్ రింగ్ రోడ్డు పూర్తి కోసం తాజా ప్రతిపాదనలు

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణలో రెండో మహానగరం గ్రేటర్ వరంగల్. 2.56 లక్షల కుటుంబాలు.. సుమారు 11 లక్షల జనాభా ఉన్న ఈ నగరం.. విలీన గ్రామాలు కలుపుకుని 408 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా ఉన్న ఓరుగల్లులో రోజు రోజుకు పరిశ్రమలు, వైద్య, విద్యా, వాణిజ్య, వ్యాపారరంగాలు విస్తరిస్తున్నాయి. సుందరనగరంతో పాటు స్మార్ట్‌సిటీ, హృదయ్ తదితర స్కీముల ద్వారా అనేక పథకాలు అమలవుతుండగా.. పర్యాటక ప్రాంతంగా కూడా విలసిల్లుతోంది. వరంగల్ నగర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తుండగా.. నగరం చుట్టూ జాతీయ, రాష్ట్ర రహదారులు మంజూరై పనులు మొదలు కావడం ద్వారా రవాణారంగం మరింత మెరుగుపడనుంది. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, సిద్దిపేట, మహారాష్ట్రల నుంచి వచ్చే వారికి ప్రయాణ సమయం తగ్గడంతోపాటు దూరభారం కూడ తప్పనుంది.

నగరం చుట్టూ రహదారులు...

వరంగల్ నగరాన్ని తాకేలా మంజూరైన భువనగిరి - ఆరెపల్లి రోడ్డు నిర్మాణం పూర్తయింది. స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి, భువనగిరి ప్రాంతాల్లో కొద్దిపాటి పనులున్నా.. అవి కూడా పూర్తి చేసి వరంగల్ ఔటర్ రింగ్‌రోడ్డును తాకుతూ వెళ్లేలా అన్ని సౌకర్యాలు కల్పించారు.

- ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జగిత్యాల - వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 563) పనులు కూడా నాలుగు రోజుల కిందట మొదలెట్టారు. రైతులు వేసిన పంట చేతికి రావడంతో ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ధర్మసాగర్ మండలాల్లోని ఆ రోడ్డు వెంట ఉన్న భూములను స్వాధీనం చేసుకుని లెవెలింగ్ చేస్తున్నారు. కరీంనగర్-వరంగల్ మధ్య ఈ రహదారి పొడవు 68.34 కిలోమీటర్లు కాగా రూ.2,164 కోట్లతో ఈ పనులు సాగుతున్నాయి.
- మంచిర్యాల-వరంగల్ రహదారి గ్రేటర్‌ను తాకుతూ వెళ్లుంది. 112 కి.మీ.లు, రూ.2,490 కోట్లతో చేపట్టే ఈ రహదారి నిర్మాణం కోసం 1,475 ఎకరాల భూసేకరణ జరిగింది. మంచిర్యాల నుంచి మంథని, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, వరంగల్, పర్కాల, ఆత్మకూరు, శాయంపేట, దామెరల మీదుగా వెళ్లే రోడ్డు పనులు వేగం కానున్నాయి.
- ఖమ్మం - వరంగల్‌ల మధ్య రహదారి 107 కి.మీ.ల కోసం రూ.2,249 కోట్లు కేంద్రం కేటాయించగా, 1,410 ఎకరాల భూసేకరణ ప్రక్రియ చేపట్టింది. వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలో ఉండే ఈ రహదారి.. గ్రేటర్ వరంగల్ విలీన ప్రాంతాలతో పాటు ఊరుగొండ, గీసుగొండ, మచ్చాపూర్, సంగెం, నెక్కొండ, పర్వతగిరి, వెంకటయ్యపాలెం ముఖ్య పట్టణాలను తాకుతుంది.





కరీంనగర్ - వరంగల్ ఎన్‌హెచ్ నిర్మాణం కోసం రోడ్డు పక్కన చేసిన లెవెలింగ్

సిద్దిపేట - వరంగల్‌కు నిధులు..

సిద్దిపేట - వరంగల్‌ను కలిపే స్టేట్ హైవేను ఎల్కతుర్తి వరకు నిర్మించేందుకు కేంద్రం నిధులు విడుదల చేసింది. గతేడాదే ఈ పనులు ప్రారంభించాల్సి ఉన్నా.. భూసేకరణతోపాటు కొన్ని సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగింది. 765 డీజీగా పేరున్న సిద్దిపేట - ఎల్కతుర్తి రోడ్డు పొడవు 64 కి.మీ కాగా.. ఈ రోడ్డు కోసం రూ.578 కోట్లు కేటాయించారు. భూసేకరణ సైతం పూర్తి కాగా.. ఇటీవలే హైదరాబాద్‌లో ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల ఉన్నత స్థాయి సమీక్ష జరిగింది. ఆ రోడ్డు నిర్మాణం జరిగితే హైదరాబాద్ నుంచి వయా సిద్దిపేట, హుస్నాబాద్, ఎలకతుర్తిల ద్వారా వరంగల్‌కు చేరేందుకు చాలా సౌకర్యంగా ఉంటుంది.

'ఔటర్' నిధులకు తాజా ప్రతిపాదన...

ఔటర్ రింగురోడ్డు పనులకు ముఖ్యమంత్రి కేసీఆర్ సుమారు ఆరేళ్ల కిందట సంగెం వద్ద శంకుస్థాపన చేశారు. వరంగల్ నూతన మాస్టర్‌ప్లాన్‌లో కొత్త ప్రాజెక్టు చేరింది. రీజినల్ ఔటర్ రింగురోడ్డు నగర శివారు నుంచి వెళ్లే ఐదు జాతీయ, రాష్ట్ర రహదారులను అనుసంధానం చేసే విధంగా డిజైన్ చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌నుంచి అప్పటి వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట, సంగెం, గీసుకొండ, ఆత్మకూరు, దామెర, అంబాల, ఎల్కతుర్తి, జనగామ జిల్లా వేలేరు, చిల్పూరు మండలాల మీదుగా తిరిగి స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుతుంది. సుమారు 135 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ ఓఆర్‌ఆర్‌కు తక్షణమే నిధులు ఇవ్వాలని తాజాగా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఐదు జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు పూర్తయితే గ్రేటర్ వరంగల్‌కు మహర్దశ పట్టనుంది. త్వరలోనే ఓఆర్‌ఆర్ పనులు చేపట్టే అవకాశం ఉందని 'కుడా'కు చెందిన ఓ అధికారి అభిప్రాయం వ్యక్తం చేయగా, 563 జాతీయ రహదారి పనుల్లో మరింత వేగం పెంచనున్నట్లు ఇన్‌చార్జ్ పీడీ మాధవి తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన

వరంగల్ లీగల్ : వరంగల్, హనుమకొండ జిల్లాల కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదనం భవనంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, ఆయా జిల్లాల్లో న్యాయసేవాధి కార సంస్థ చైర్మన్లు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. న్యాయమూర్తులు మనీషామెహ్రా, వై.సత్యేంద్ర, ఎం.వెంకటేశ్వరరావు, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్ రావు, హనుమకొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ శ్రీవత్స, ఈస్ట్ జోన్ డీసీపీ ఎంఏ బారితో కలిసి వారు జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వరంగల్ జిల్లాలో 7 బెంచీలను ఏర్పాటు చేసి మొత్తం 2,721 పెండింగ్ కేసులు, హనుమకొండ జిల్లాలో 5 బెంచీలను ఏర్పాటు చేసి మొత్తం 188 పెండింగ్ కేసులను పరిష్కరించామని పేర్కొన్నారు. వివిధ కేసులను పరిష్కరించేందుకు వరంగల్ జిల్లాలో 7, నర్సంపేటలో 2, బెంచీలు, హనుమకొండ జిల్లాలో 5, పరకాలలో 1 బెంచీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాధాదేవి, పక్కన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి

దీర్ఘకాలిక పెండింగ్ కేసుల్లో రాజీమార్గమే రాజమార్గమన్నారు. సమయంతోపాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎలుకుర్తి ఆనంద్ మోహన్, వై.శ్యాంసుందర్‌రెడ్డి, గవర్నమెంట్ ప్లీడర్లు శ్యాంసుందర్, డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, సభ్యులు ఈవీ. శ్రీనివాస్‌రావు, న్యాయవాదులు, బెంచ్ మెంబర్లు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మీడియమ్స్‌లో ప్లాంటేషన్ తప్పనిసరి

బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: మహానగర ప్రధాన రహదారుల్లోని సెంట్రల్ మీడియమ్స్‌లో తప్పనిసరిగా ప్లాంటేషన్ చేపట్టాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శనివారం నగరంలోని పోచమ్మమైదాన్ నుంచి దేశాయిపేట, లక్ష్మీ టౌన్‌షిప్, ధర్మారం గ్రాండ్ ఎంట్రెన్స్, వెంకట్రామ జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్ నుంచి నాయుడు పెట్రోల్ పంపు వరకు తనిఖీ చేశారు. ఉర్సు రంగలీలా మైదానం, ఖుష్ మహల్ ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించారు. ఉర్సు గుట్ట వద్ద నిర్మిస్తున్న ఎస్‌టీపీను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఖమ్మం రోడ్డులోని వాల్‌మార్టు ప్రాంతంలో టీఎస్ బీపాస్‌లో దరఖాస్తులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ అనిసుర్ ఉర్ రషీద్, సీఎంహెచ్‌ఓ రాజేష్, సీహెచ్‌ఓ శ్రీనివాస్ రావు, ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, కృష్ణారావు, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్ రెడ్డి, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఇన్‌స్పెక్టర్‌పై వేటు

- భూ వివాదమే కారణం



దయాకర్

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి.దయాకర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సీపీ రంగనాథ్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని కోమటిపల్లి సమీపంలో గల ఓ ప్లాట్‌తోపాటు కిట్స్ కళాశాల సమీపంలోని మరో ప్లాటు వివాదామే కారణం అని తెలిసింది. కోమటిపల్లి శివారులోని ఓ పట్టాదారుడు ప్లాట్లు చేసి విక్రయించాడు. తండ్రి మరణానంతరం కొడుకులు కూడా మళ్లీ అవే ప్లాట్లను మరోసారి ఇతరులకు విక్రయించారు. దీంతో బాధితులు కేయూ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.

కేసు నమోదు చేయకపోవడంతో...

బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో వారు నగర కమిషనర్‌ను కలిసి గోడు వెలిబుచ్చారు. అదేవిధంగా కిట్స్ కళాశాల సమీపంలో కూడా ఓ భూ వివాదంలో కూడా పోలీస్ ఇన్‌స్పెక్టర్ దయాకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బాధితుడు.. కమిషనర్‌ను కలిసి మొరపెట్టుకున్నాడు. ఈ వ్యవహారంపై సీపీ రంగనాథ్ విచారణ జరిపించారు. దీనిని సీరియస్‌గా పరిగణించి చర్యలు తీసుకున్నారు. దయాకర్‌పై వేటు పడడం ఇది రెండోసారి. గతంలో హనుమకొండ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఓ వివాదంలో బాధితుడికి వ్యతిరేకంగా వ్యవహరించినందుకు వేటు పడింది.

రియల్టర్లకు పోలీసుల సహకారం..

ఇదిలా ఉండగా, నగరంలోని కాకతీయ యూనివర్సిటీ, హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న భూ సెటిల్‌మెంట్‌లో పోలీస్ అధికారుల హస్తం ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఇన్‌స్పెక్టర్లకు కలిసిరాని 'కేయూ' స్టేషన్

కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు కలిసి రావడం లేదు. ఇక్కడ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా వచ్చిన వారికి ఉన్నతాధికారులనుంచి అంక్షితలు తప్పడం లేదు. లష్కర్ సింగారం సమీపంలోని ఓ భూవివాదంలో బాధితురాలికి వ్యతిరేకంగా వ్యవహరించినందుకు అప్పటి ఇన్‌స్పెక్టర్ సదయ్య (ఈయన ప్రస్తుతం రామగుండం ఏసీపీగా పనిచేస్తున్నారు) అధికారిని బదిలీ చేశారు.

- రెడ్డిపురంలో ఓ భూ వివాదంలో భూకబ్జాదారుడికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఇద్దరు పోలీస్ ఇన్‌స్పెక్టర్లు అలీ, సతీష్ ఇతర ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు.
- గోపాలపురంలోని ఓ భూ వివాదంలో భూకబ్జాదారుడికి మద్దతు పలికినందుకు ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావుతోపాటు మరో ఎస్సై సస్పెండ్‌కు గురయ్యారు.
- భూ వివాదాల్లో కబ్జాదారులకు అనుకూలంగా మాట్లాడుతున్నారనే ఆరోపణపై ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజును వీఆర్‌కు పంపించారు.

సాయంత్రమే సెటిల్‌మెంట్లు..

కేయూ పోలీస్‌స్టేషన్‌లో సాయంత్రం అయితే చాలు విపరీతమైన రద్దీ ఉంటుంది. భూ వివాదాల విషయమై ఫిర్యాదు చేస్తే సదరు బాధితుడు, కబ్జాదారుడికి సాయంత్రమే రమ్మని కబురు పెడతారని స్థానికంగా చర్చించుకుంటున్నారు. రాత్రి ఎనిమిది గంటల వరకు ఇక్కడ దర్బార్ సాగుతున్నట్లు పలువురు బాధితులు చెబుతుంటారు.

మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కేంద్ర మంత్రి బీఎల్.వర్మ

కాజీపేట అర్బన్ : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, కేంద్ర సహకార శాఖ మంత్రి బీఎల్.వర్మ సూచించారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గస్థాయి, మహాజన సంపర్క్ అభియాన్ బీజేపీ మోర్చా సంయుక్త సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రారంభించిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం ఎంతో విశిష్టమైనన్నారు. బీజేపీ బలోపేతానికి యువ, మహిళ, కిసాన్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మోర్చాలు కృషి చేయాలన్నారు. సమ్మేళనంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీష్‌షా, రవినాయక్, తాళ్లపల్లి కుమారస్వామి, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, తిరుపతిరెడ్డి, బండి సాంబయ్య, బన్నా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

వరంగల్ : దేశాయిపేట రోడ్డు 13వ డివిజన్‌లోని ఎల్బీనగర్ తూర్పు నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని శనివారం కేంద్ర మంత్రి బీఎల్ వర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బీఎల్.వర్మ

నేడు కేంద్ర మంత్రి బీఎల్ వర్మ పర్యటన

హన్మకొండ : కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి బీఎల్.వర్మ ఆదివారం హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు పర్యటన వివరాలు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ వివరించారు. ఉదయం 7.15 గంటలకు వేయిస్తంభాల ఆలయంలో పూజలు చేస్తారు. 9.45 గంటలకు పరకాల అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమవుతారు. 11 గంటలకు భూపాలపల్లికి చేరుకుని నియోజకవర్గ అసెంబ్లీ కోర్ కమిటీ, ఆఫీస్ బేరర్ల సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.45 గంటలకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో స్మార్ట్‌సిటీ పనులపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు పార్టీ సంయుక్త మోర్చాల సమావేశంలో పాల్గొంటారు.

కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం

నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

కాశిబుగ్గ: తెలంగాణ సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శనీయమని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం శివనగర్‌ని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటు నుంచి నేటి వరకు ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని తెలిపారు. వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్‌లో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ఈ గవర్నెన్స్ కోసం కావాల్సిన పారదర్శకత, వికేంద్రీకరణ, స్ట్రెంతనింగ్ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్ అంశాల్లో మన రాష్ట్రంలో చాలా మార్పులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీవాత్సవ, ఆర్డీఓ మహేందర్‌జీ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పక్కన కలెక్టర్ ప్రావీణ్య

బీఆర్‌ఎస్‌తోనే సుపరిపాలన



జిల్లా ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, కలెక్టర్ సిక్తాపట్నాయక్, పోలీస్ కమిషనర్ రంగనాథ్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ తదితరులు

జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్

హన్మకొండ : పరిపాలన వికేంద్రీకరణతో ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువైందని జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సుపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రగతి నివేదికను ఆవిష్కరించి, వివిధ శాఖల్లో వచ్చిన మార్పులు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే సుపరిపాలన సాధ్యమని స్పష్టం చేశారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పాలనలో అనేక మార్పులు వచ్చాయన్నారు. సాంకేతికపరంగా టీఎస్ ఐపాస్, ధరణి తదితర సేవలు అందుబాటులోకి రావడంతో పనులు సులభంగా, వేగంగా పూర్తి అవుతున్నట్లు తెలిపారు. సీపీ రంగనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పోలీస్ శాఖలోనూ అనేక మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి రెవెన్యూ శాఖలో సంస్కరణలు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్‌రిజ్వాన్ బాషా, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ లలితాయాదవ్, డీఆర్వో వాసుచంద్ర, పరకాల ఆర్డీఓ రాము, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, సీపీఓ సత్యనారాయణరెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ హరిప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మేన శ్రీను, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్‌రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రూప్-1 ప్రిలిమినరీ'కి సర్వం సిద్ధం

- నేటి ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పరీక్ష
- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: జిల్లాలో ఆదివారం జరగనున్న టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఇందుకోసం 55 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 11 రూట్లుగా విభజించి 55 సెంటర్లకు 55 మంది లైజన్ ఆఫీసర్లను నియమించినట్లు వివరించారు. పరీక్షకు మొత్తం 21,036 అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో వికలాంగుల కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి తిరిగి పరీక్ష కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటీరియల్ తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పరీక్షకు ముందుగా మాక్ డ్రిల్ నిర్వహించాలని తెలిపారు. కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపును నిర్వహించాలని, పరీక్షకు ముందు ఓఎంఆర్ షీట్, హాల్‌టికెట్ నంబర్, ఇతర అంశాలకు సంబంధించి బబ్లింగ్ చేసే విధానాన్ని అభ్యర్థులకు వివరించాలని సూచించారు.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు : సీపీ ఏవీ రంగనాథ్

వరంగల్ క్రైం: పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం నిర్వహించబోయే గ్రూప్-1 పరీక్షకు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం పోలీస్ కమిషనరేట్‌లో అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలో 34,162 మంది అభ్యర్థులు హాజరవుతుండగా, 89 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందులో సెంట్రల్ పరిధిలో 70, ఈస్ట్ జోన్ పరిధిలో 5, వెస్ట్ జోన్ పరిధిలో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి 500 మీటర్ల పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందన్నారు. పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో క్రైం డీసీపీ మురళీధర్, డీసీపీలు అబ్దుల్‌బారి, కరుణాకర్, సీతారాం, అదనపు డీసీపీ సంజీవ్‌తోపాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



పోలీస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

అభ్యర్థులకు సూచనలు ఇలా..

- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు చెప్పులు ధరించాలి. బూట్లు, బెల్ట్ వేసుకుని రావొద్దు.
- ఉదయం 8.30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. 10.15 గంటల తర్వాత వచ్చిన వారికి అనుమతి లేదు.
- బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్, హాల్ టికెట్, ఏదేని గుర్తింపుకార్డు తీసుకుని రావాలి.
- సెల్‌ఫోన్లు, చేతిగడియారాలు, హెడ్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావొద్దు.
- అభ్యర్థులను ముందుగా క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోనికి అనుమతిస్తారు.
- దివ్యాంగులు.. సంబంధిత అధికారులు జారీచేసిన పత్రాలతో కేంద్రానికి రావాలి.



హాల్‌టికెట్ నంబర్ వేసే టేబుల్‌ను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

పరీక్ష కేంద్రాల పరిశీలన..

కరీమాబాద్: వరంగల్ నగరంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం పరిశీలించారు. వరంగల్-ఖమ్మం రోడ్ బెస్తం చెరువు సమీపంలోని సిల్వర్ క్రోస్ హైస్కూల్, బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజీలను పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టర్ వెంట ఖిలావరంగల్ తహసీల్దార్ ఫణికుమార్ ఉన్నారు. ఇదిలా ఉండగా వరంగల్ వ్యాప్తంగా 6 రూట్లలోని 24 పరీక్ష కేంద్రాల్లో 9,716 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

భూ వివాదం.. రైతు ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న అంజయ్య

రఘునాథపల్లి : భూ వివాదం.. ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి కారణమైంది. ఈ ఘటన మండలంలోని జాఫర్‌గూడెంలో జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పులిగిల్ల అంజయ్యకు ఖిలాషాపూర్ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 1424లో 6 ఎకరాల భూమి ఉంది. 25 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ భూమి సమీపంలో ఉన్న రైస్ మిల్లు యజమాని పెండ్లి మల్లారెడ్డి, తన కుమారుడు దిలీప్‌రెడ్డి సర్వే నంబర్ 1420లో 2 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. వారు కొనుగోలు చేసిన భూమి సర్వే నంబర్ అంజయ్య ఆధీనంలో ఉన్న భూమిలో చూపిస్తోంది. దీంతో ఈ భూమిని తాము కొనుగోలు చేసినట్లు కొన్నాళ్ల నుంచి తండ్రీ కొడుకులు..అంజయ్యను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీనిపై అంజయ్య రెండుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పట్టించుకోలేదు. ఈ క్రమంలో శనివారం తన కుమారుడు మధుతో కలిసి ఆ భూమిలో పెసరకు నీరు పారించేందుకు వెళ్లారు. వీరిని గుర్తించిన మల్లారెడ్డి, దిలీప్‌రెడ్డి రైస్ మిల్లులో పనిచేసే కూలీలతో వెళ్లి బెదిరించారు. ఓ దశలో దాడికి యత్నించడంతో మనస్తాపానికి గురైన అంజయ్య పురుగుల మందు తాగాడు. దీంతో కుమారుడు మధు, భార్య పద్మ గుర్తించి వెంటనే అంజయ్యను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రఘుపతి.. అంజయ్య వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. మల్లారెడ్డి, దిలీప్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మాయదారి మహమ్మారి..

మరణశయ్యపై యువతి శైలు..
- దీర్ఘకాలిక వ్యాధితో ఆస్పత్రి పాలు
- నెలనెలా మందులకే రూ. 25వేలు
- ప్రభుత్వ సాయం కోసం వేడుకోలు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

కన్నీటి గాథ

టేకుమట్ల (రేగొండ) : ఓ చేతిలో పెన్ను.. మరో చేతిలో పుస్తకం.. ఉదయం తరగతి గదిలో.. సాయంత్రం ఇంట్లో (హోమ్ వర్క్) చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాల్సిన ఓ విద్యార్థిని మాయదారి మహమ్మారితో మంచానికే పరిమితమైంది. 5వ తరగతి వరకు హాయిగా ఆడుతూపాడుతూ చదువుకున్న ఆ విద్యార్థిని 6వ తరగతిలో అనారోగ్యానికి గురైంది. అప్పటి నుంచి ఆస్పత్రికే అంకితమైంది. రోజూ ఆహారానికి బదులు మాత్రలు, నీటికి బదులు గ్లూకోజ్ తీసుకుంటూ ప్రాణాలతో పోరాడుతోంది. లక్షల్లో ఒక్కరికి అరుదుగా సోకే వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం మరణశయ్యపై కొట్టిమిట్టాడుతోంది. కాగా, నెలనెలా మందులకే వేలాది రూపాయల ఖర్చు అవుతోంది. దీంతో రెక్కాడితేకాని డొక్కాడని ఆ కుటుంబం ప్రభుత్వ సాయం కోసం ప్రాధేయపడుతోంది. అలాగే, మానవత్వంతో చేయూతనందించే దాతల ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నది.

ఆరో తరగతిలోనే అనారోగ్యం..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చిన్నకోడెపాకకు చెందిన తంగేళ్ల విజయ, రవి దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో రెండో కుమార్తె తంగేళ్ల శైలు 6వ తరగతిలోనే అనారోగ్యానికి గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు తమ కూతురును వరంగల్, హైదరాబాద్ లోని పలువురు వైద్యులకు చూపించగా వారు శైలుకు ఎస్‌ఎల్‌ఈ (సిస్టమిక్ ల్యూపస్ ఎరిథెమాటసస్) అనే వ్యాధి వచ్చినట్లు నిర్ధారించారు. ఒక వైపు వ్యాధి బారిన పడినప్పటికీ.. మరోవైపు శైలు చదువు కొనసాగించారు. 2017లో పదో తరగతిలో 7.9 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం ఇంటర్ బైపీసీలో చేరారు. అయితే 2020 మార్చిలో నడవలేని స్థితిలో వార్షిక పరీక్షలు రాయలేక పోయారు. అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యారు.


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న శైలు

నిత్యం వైద్యుల పర్యవేక్షణలోనే..

దీర్ఘకాలిక వ్యాధి బారిన పడిన శైలు నిరంతరం వైద్యుల పర్యవేక్షణలోనే ట్రీట్‌మెంట్ పొందుతున్నారు. నిమ్స్, ఎంజీఎం తోపాటు పలు ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కాగా, శైలుకు చికిత్స అందిస్తున్న డాక్టర్లు మరోవైపు ఆ వ్యాధిపై పరిశోధనలు చేస్తున్నారు.

మందులకే నెలకు రూ. 25వేల ఖర్చు..

తంగేళ్ల శైలుకు సోకిన దీర్ఘకాలిక వ్యాధిని అదుపులో ఉంచడానికి నెలకు కేవలం మందులకే రూ. 20 నుంచి రూ. 25 వేల వరకు ఖర్చు అవుతోంది. రోజుకు ఐదు రకాల మందులను క్రమం తప్పకుండా వేయించాలి. ఏ ఒక్కటి తగ్గినా ప్రాణానికే ప్రమాదమని వైద్యులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ సాయం కోసం వేడుకోలు..

తమ కూతురు బంగారు భవిష్యత్ ఇలా అనారోగ్యం బారినపడడంతో తల్లిదండ్రులు మానసికంగా కుంగిపోతున్నారు. అంతేకాకుండా ఆర్థికంగా అష్టకష్టాలు పడుతూ వైద్యం చేయించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వ సాయం కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు.అలాగే, దాతల ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

దాతలు ఇలా విరాళాలు అందించొచ్చు..

తమ కూతురు తంగేళ్ల శైలు ప్రాణం కాపాడానికి దాతలు ముందుకు రావాలని తల్లిదండ్రులు చేతులెత్తి వేడుకుంటున్నారు.

9676165929 ఈ నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అలాగే, యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ : **138510100121498,**

ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : యుబిఐఎన్0813851లో ఆపన్నహస్తం అందించాలని కోరుతున్నారు.

వైద్యసేవలు, విజయాలను వివరించాలి

- 14న వైద్య, ఆరోగ్య దినోత్సవం
- డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి

ఎంజీఎం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న నిర్వహించనున్న వైద్యారోగ్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యాధికారులు, అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవలు, సాధించిన విజయాలను హెల్త్ డే రోజు వివరించాలన్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అస్పత్రిలో రోగులకు పెడుతున్న భోజనాన్ని రుచి చూశారు. భోజనం బాగుందని కితాబిచ్చారు. అయితే పండ్లు ఎందుకు పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి, హనుమకొండ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, ఆర్‌ఎంఓలు మల్లికార్జున్, మురళి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంఈ రమేష్‌రెడ్డి

స్వరాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం..


మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలకు మహర్దశ
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి: స్వరాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందని, తెలంగాణలో గ్రామ స్వరాజ్యం ఆవిర్భవించిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని మహబూబ్‌నగర్‌లో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, వైకుంఠ ధామాలను అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 60 ఏళ్ల ఉమ్మడి పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనకబడిందన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ వివిధ పథకాలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలు, సీసీరోడ్లు, మురుగు నీటి కాల్వలు, మెటల్‌రోడ్లు, మిషన్ భగీరథ నల్లాలకు సంబంధించిన పనులు వేగవంతమైనట్లు తెలిపారు. అభివృద్ధిని పక్కనబెట్టి ప్రజలను పక్కదోవ పట్టించేందుకు వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాదె హేమలతారవీందర్‌రెడ్డి, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ చిక్కొండ రజిత, ఉపసర్పంచ్ సురేష్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహానాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా లింగనిర్ధారణ యంత్రాల విక్రయం


నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ


స్వాధీనం చేసుకున్న స్కానింగ్ యంత్రాలు

- ఇద్దరు వ్యక్తులు అరెస్టు
- రూ. 25 లక్షల విలువైన యంత్రాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ ఏవీ రంగనాథ్

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అనుమతులు లేకుండా, అర్హత లేని వ్యక్తులకు లింగనిర్ధారణ చేసే స్కానింగ్ యంత్రాలను విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను కేయూసీ, దామెర పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ. 25 లక్షల విలువైన 6 పోర్టబుల్, 12 ఫిక్స్‌డ్ స్కానింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. శనివారం సాయంత్రం కమిషనరేట్‌లో నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు.

సులభంగా డబ్బు సంపాదించడమే ధ్యేయంగా..

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన మల్లివుడి అశోక్ కుమార్, నెల్లురుకు చెందిన తాతపూడి కిరణ్ కుమార్ సులభంగా డబ్బు సంపాదించడానికి ఈ మార్గం ఎంచుకున్నారు. గత నెలలో అక్రమంగా లింగనిర్ధారణకు పాల్పడుతూ అరెస్టు అయిన ప్రధాన నిందితుడు వేముల ప్రవీణ్ సమాచారం మేరకు.. మల్లిపుడి అశోక్ కుమార్ విజయవాడలో 2012 సంవత్సరం నుంచి ఎమిలిటీ కన్సల్టెన్సీ సర్వీస్ ఇంజినీర్ ఈసీజీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రాలను మరమ్మతులు చేసేవాడు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లోని హాస్పిటల్స్‌కు చెందిన స్కానర్లు మరమ్మతులు చేయడం ద్వారా సంబంధిత డాక్టర్లతో పరిచయమైంది. అనంతరం ఆ హాస్పిటల్స్ నుంచి పాత స్కానర్లను కొనుగోలు చేయడంతో పాటు చెన్నైలో కూడా పాత స్కానింగ్ యంత్రాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటికి మరమ్మతులు చేసి ఎక్కువ ధరకు, అర్హత లేని వ్యక్తులకు విక్రయించేవాడు. ఈ క్రమంలో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో స్కానింగ్ యంత్రాల మరమ్మతు చేసే క్రమంలో వేముల ప్రవీణ్‌తో పరిచయమై ఆయనకు అక్రమంగా ఒక స్కానింగ్ యంత్రాన్ని విక్రయించాడు. ఈ క్రమంలో ప్రస్తుతం నిందితుడి నుంచి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న మరో 4 పోర్టబుల్, 11 ఫిక్స్‌డ్ స్కానింగ్ యంత్రాలను కేయూసీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మరోఘటనలో..

గత నెలలో అక్రమంగా లింగనిర్ధారణకు పాల్పడుతూ అరెస్ట్ అయిన డాక్టర్ సబిత సమాచారం మేరకు ఆమెకు అక్రమంగా స్కానింగ్ యంత్రాన్ని అమ్మిన మరో నిందితుడు తాతపూడి కిరణ్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీపీ తెలిపారు. నిందితుడు కిరణ్ కుమార్ 2018లో డేవిస్ మెడికల్ ఎక్విప్‌మెంట్ కంపెనీ సెట్స్ మెన్‌గా పనిచేస్తూనే స్కానింగ్ యంత్రాల మరమ్మతులు చేయడం నేర్చుకున్నాడు. 2021లో కావలి ప్రాంతంలో «పవిత్ర టెక్నాలజీ» పేరుతో స్కానింగ్ సర్వీసు సెంటర్ ఏర్పాటు చేసి వివిధ హాస్పిటల్స్ లోని స్కానింగ్ యంత్రాలను మరమ్మతులు చేసేవాడు. హనుమకొండకు వచ్చిపోయే క్రమంలో డాక్టర్ సబితతో పరిచయం ఏర్పడి ఆమెకు అనుమతులు లేకుండా రూ. లక్షకు స్కానింగ్ యంత్రాన్ని విక్రయించినట్లు నిందితుడు అంగీకరించాడు. ఇతని నుంచి మరో రెండు పోర్టబుల్ , ఒక ఫిక్స్‌డ్ స్కానింగ్ యంత్రాన్ని దామెర పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.

అధికారులకు అభినందనలు

నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్పీ పుష్ప, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ సుజాత, కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వినయ కుమార్, ఎస్సైలు సతీష్, రాజేందర్, జానీ పాషా, షేక్, ఫసియుద్దీన్, మల్లేషం, ఏఏఓ సల్మాన్ పాషా, హెడ్ కానిస్టేబుల్ నర్సింగ రావు, కానిస్టేబుళ్లు సంపత్, రాజేశ్, రవీందర్, సైబర్ క్రైం కానిస్టేబుల్ రాజు, ఏహెచ్‌టీయూ సిబ్బంది, ఏఎస్‌ఐ భాగ్యలక్ష్మీ, హెడా కానిస్టేబల్ సమీయుద్దీన్, కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సీపీ అభినందించారు.

తండ్రి మందలించాడని..
క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య


అజార్ (ఫైల్)

ఖానాపురం: తండ్రి మందలించాడనే కారణంతో క్షణికావేశానికి గురైన ఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం బుధరావుపేటలో జరిగింది. గ్రామానికి చెందిన షేక్ అజార్(26) నర్సంపేటలోని ఓ మైనార్టీ పాఠశాలలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికెళ్లాడు. ఆలస్యంగా ఇంటికి రావడంతో తండ్రి సర్వర్ మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన అజార్ గ్రామ శివారులోని నల్లాల బావి వద్దకు వెళ్లాడు. స్నేహితులు ఆజం, ప్రణయ్‌కు ఫోన్ చేసి నేను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, ఇదే నా చివరి ఫోన్ కాల్ అంటూ విషయం చెప్పాడు. ఆందోళనకు గురైన స్నేహితులు వెంటనే ద్విచక్రవాహనంపై బావి వద్దకు వెళ్తూ మరో స్నేహితుడు నాగరాజుకు సమాచారం అందించారు. మొదట ఆజం, ప్రణయ్ బావి వద్దకు చేరుకుంటుండగా వారిని చూసిన ఆజార్ బావిలో దూకాడు.స్నేహితుడిని రక్షించుకోవాలనే తపనతో ప్రణయ్ సైతం బావిలో దూకాడు. ప్రణయ్ చేతికి చిక్కిన అజార్ భయంతో గట్టిగా పట్టుకోవడంతో ప్రణయ్ సైతం ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లాడు. బావి వద్దకు వచ్చిన మరో స్నేహితుడు నాగరాజు సహాయంతో ప్రణయ్ బయటకు వచ్చాడు. అజార్‌కి ఎలాంటి రక్షణ అందకపోవడంతో నీటిలో మునిగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బావి వద్దకు చేరుకొని కుమారుడిని బయటకు తీసే ప్రయత్నం చేశారు. సాధ్యపడకపోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకుని అజార్ మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా, ఈ ఘటనపై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మానసిక ఒత్తిడితో యువతి..


రమ్య (ఫైల్)

రఘునాథపల్లి: మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఓ యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని నిడిగొండలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తూడి బాలయ్య -ప్రమీల దంపతులకు ఇద్దరు కూతుళ్లు రేణుక, రమ్య (26), కుమారుడు రమేష్ ఉన్నారు. వివాహం అయిన పెద్ద కూతురు రేణుక గొడవల కారణంగా విడాకులై తల్లిగారింటి వద్దే ఉంది. అక్క ఇంటి వద్దనే ఉండడం , తనకు పెళ్లి కావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన రమ్య శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో సీలింగ్ ప్యాన్‌కు ఉరివేసుకొంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రఘుపతి సంఘటనా స్థలానికి చేరుకొని బలవన్మారణానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

మానసిక పరిస్థితి బాగోలేక వివాహిత..


సౌమ్య (ఫైల్)

దేవరుప్పుల: మానసిక పరిస్థితి బాగోలేక జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం కోలుకొండలో చోటుచేసుకుంది. ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ కథనం మేరకు.. కోలుకొండకు చెందిన గుండెకారి అనిత, శ్రీనివాస్ కూతురు సౌమ్య(28)ను ఆరేళ్ల కిందట ఇదే మండలంలోని రామచంద్రాపురానికి చెందిన మేనల్లుడు దుదాటి సతీష్‌కు ఇచ్చి వివాహం చేశారు. జీవనోపాధి కోసం కోలుకొండలో స్థిరపడిన వీరికి కూతురు జన్మించింది. ఇటీవల సౌమ్య ఆరోగ్య పరిస్థితి బాగాలేక మానసికంగా ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో శనివారం సౌమ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంద. తండ్రి గుండెకారి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సౌమ్య మృతదేహాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

మహాదేవ ఇండస్ట్రీస్‌లో భారీ అగ్ని ప్రమాదం

కాలిపోయిన ధాన్యం, బియ్యం బస్తాలు
- రూ.2 కోట్ల మేర ఆస్తి నష్టం
- షార్ట్ సర్క్యూట్‌తోనే మంటలు
- సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శంకర్‌నాయక్


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కేసముద్రం : షార్ట్ సర్క్యూట్‌తో ఓ రైస్‌మిల్లులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.2 కోట్ల విలువైన ధాన్యం, బియ్యం బస్తాలు, గన్నీ సంచులు, మిషన్ పరికరాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం భుక్యారాంతండా జీపీ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు, అధికారులు కథనం ప్రకారం.. కేసముద్రం విలేజ్ సమీపంలోని మహాదేవ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో ఎప్పటిలాగే పనులు ముగించుకుని శుక్రవారం సాయంత్రం సిబ్బంది ఇంటికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున మిల్లు వద్దకు బస్తాలను లోడ్ చేసేందుకు హమాలీలు వచ్చారు. ఈ క్రమంలో మిల్లు నుంచి పొగలు రావడాన్ని వారు గమనించి యాజమాన్యానికి సమాచారం అందించారు. ఈ క్రమంలో బస్తాలకు అంటుకున్న మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. మిల్లు యజమాని అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా పూర్తిస్థాయిలో చల్లారలేదు. దీంతో మిల్లు గోడను జేసీబీ సాయంతో కూలగొట్టి ఫైర్ సిబ్బంది మధ్యాహ్నం వరకు మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే 5 వేల క్వింటాళ్ల ధాన్యం బస్తాలు, 1,500 క్వింటాళ్ల బియ్యం, 10 వేల గన్నీసంచులు, మిల్లు పరికరాలు దగ్ధమైనట్లు అధికారులు అంచనా వేశారు. మొత్తం రూ.2 కోట్ల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, జేసీ డేవిడ్, పౌరసరఫరాల శాఖ డీఎం కృష్ణవేణి, డీటీ నారాయణరెడ్డి, సీఐ రమేష్, ఎస్సై తిరుపతి, తహసీల్దార్ సాంబశివుడు, తదితరులు సందర్శించారు. ఘటన వివరాలను సేకరించారు. ఇదిలా ఉండగా మహాదేవ ఇండస్ట్రీస్ సీఎంఆర్ కింద 94 ఏసీకేల బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 8 ఏసీకేలు అందించినట్లు అధికారులు తెలిపారు. కాగా, మిల్లు యజమాని నీలం సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

నకిలీ గురుస్వామికి దేహశుద్ధి


నకిలీ గురుస్వామికి దేహశుద్ధి చేస్తున్న మహిళలు

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఓ నకిలీ గురుస్వామికి మహిళలు దేహశుద్ధి చేశారు. ఎస్సై రాంజీనాయక్ కథనం ప్రకారం తొర్రూరు ప్రాంతానికి చెందిన ఈదురుకట్ల యాకయ్య (అలియాస్ శ్రీను) అనే నకిలీ గురుస్వామికి హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌కు చెందిన పాలడుగు శ్రీదేవితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సదురు మహిళ అనారోగ్యం బారిన పడింది. దీంతో తాను బాగు చేస్తానని నమ్మించి పలుమార్లు సుమారు రూ. 4 లక్షలు వసూలు చేశాడు. అంతేకాకుండా రెండు రోజులుగా బాధిత మహిళకు ఫోన్ చేస్తూ వెంటనే డబ్బు తీసుకుని తొర్రూరుకు రావాలని, లేకుంటే నగ్నంగా తన వద్దనున్న ఫొటోలు, వీడియో బయట పెడుతానాని బెదిరించాడు. దీంతో బాధిత మహిళ శనివారం సాయంత్రం కొందరు మహిళలతో తొర్రూరుకు వచ్చి గురుస్వామిగా చలామణి అవుతున్న యాకయ్యను బస్టాండ్ వద్ద చితకబాది పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం యాకయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.